# శౌర్య

**- కట్టా రాంబాబు**

రాజేష్‌ని అంతంత మాటలంటానని అనుకోలేదు. నోరు జారి అన్నానో లేక కావాలని అన్నానోగానీ ఆ క్షణంలో అనడం జరిగిపోయింది.

నేనలా అంటుంటే అతను తల దించుకున్నాడేగానీ పల్లెత్తు మాట అనలేదు. అదే మరొకరయితే ఆ మాటలకు నా చెంప ఛెళ్‌మనిపించేవారేమో! నా దగ్గర చదువుకున్నాననే గౌరవంతో అలా వున్నాడో లేక నా పెద్దరికానికి గౌరవం ఇచ్చాడోగానీ ఏం మాట్లాడకుండా తల దించుకుని వెళ్లిపోయాడు. అతని ముఖంలోని బాధావీచికల్ని నేనింకా మరచిపోలేదు.

నిజానికి అతను ఒకప్పటి నా స్టూడెంట్ అనే చనువుతో అనలేదు. అక్కడ జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక గబగబా అనేసాను. రాజేష్ నా దగ్గర సుమారు పది సంవత్సరాల క్రితం డిగ్రీ చదివాడు. చాలా మంచి విద్యార్థి అని పేరు తెచ్చుకున్నాడు. చదువులోనే కాదు వినయ విధేయతలలో కూడా ముందుండేవాడు. నేనంటే ప్రత్యేకమైన అభిమానంతో ఉండేవాడు. నేనూ అతడ్ని అభిమానించేవాడిని.

చాలాకాలం తరువాత నాకు ఈ రోజు బస్టాండ్‌లో కనిపించాడు. నేను గుంటూరు వెళదామని పొదిలి బస్టాండ్‌కొచ్చాను. అప్పుడు కన్పించాడు రాజేష్. కన్పించిన వెంటనే నమస్తే చెప్పి "బాగున్నారా సార్'' అంటూ పలకరించాడు.

"ఏమయ్యా రాజేష్! చాలాకాలానికి కన్పించావు. ఏం చేస్తున్నావు?'' అనడిగాను.

"ఒంగోలు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్నాను సార్. ఆరోగ్యం బాగుంటుందా సార్. పాపా, మేడమ్‌గారు ఎలా వున్నారు సార్'' అంటూ కుశల ప్రశ్నలు వేసాడు.

"అంతా బాగానే వున్నారుగానీ నీ ఉద్యోగం ఎలా వుంది? ప్రమోషన్స్ వచ్చే అవకాశం వుందా?''

"బాగానే ఉంది సార్. ఒకటి రెండు సంవత్సరాల్లో సీనియర్ అసిస్టెంట్ కావచ్చు సార్. మీ దగ్గర చదువుకోవడం నా అదృష్టం సార్. అసలు మన కాలేజీలో చదవడం గర్వంగా వుంటుంది సార్'' అన్నాడు.

నిజం చెప్పొద్దూ నాకు మనసులో చాలా ఆనందం కలిగింది.

"అన్నట్లు పిల్లలెంతమంది?'' అనడిగాను.

"లేరు సార్'' అన్నాడు.

"కుటుంబ నియంత్రణేమన్నా పాటిస్తున్నావా ఏమిటి?'' అన్నాను నవ్వుతూ.

"అదేం లేదు సార్. పుట్టలేదంతే!''

"పెళ్లయి ఎన్నాళ్లయింది?''

"ఆరేళ్లయింది సార్. నాలుగేళ్ళు చూసి ఎంతకీ పుట్టకపోయేసరికి ఇంకో పెళ్లి రెండేళ్ళక్రితం చేసుకున్నాను సార్.''

ఆ మాటలకు నేను చాలా ఆశ్చర్యపోయాను.

"అదేంటయ్యా పిల్లలు పుట్టకపోతే వెంటనే రెండో పెళ్లి చేసేసుకోవడమేనా? డాక్టర్‌కు చూపించి మందులు వాడకపోయారా?''

"చాలామందికి చూపించాను సార్. ఏవేవో పరీక్షలు చేసి మందులు రాసిచ్చారు. ఎంతకాలం వాడినా పుట్టలేదని మరో పెళ్లి చేసుకోవాల్సి వచ్చింది.''

"ఆ తర్వాతయినా పుట్టారా?''

"నా దురదృష్టమేమిటోగానీ ఈమెకీ పుట్టలేదు సార్. ఈమెనూ డాక్టర్‌కు చూపించాను. మందులు వాడుతోందికానీ ఫలితం కన్పించడం లేదు'' అన్నాడు నిరాశగా.

"మరి నువ్వు పరీక్షలు చేయించుకున్నావా?''

"నేను పరీక్షలు చేయించుకోవడమేమిటి సార్. నేనెందుకు? నేను మగాడ్ని కదా!''

"అదేంటయ్యా అలా అంటావు. మగవాడయితే చేయించుకోకూడదా? లోపం నీలోనూ ఉండొచ్చు కదా!''

"నా సామర్థ్యం మీద నాకు నమ్మకం వుంది సార్. నాలో ఏ లోపం వుండదు'' అన్నాడు ధీమాగా.

"చూడు రాజేష్! శారీరక సామర్థ్యానికి, పిల్లలు పుట్టడానికి ఏం సంబంధంలేదు. ఎంత బలవంతుడయినా ఈ విషయంలో ఏవో లోపాలుండవచ్చు. ఇప్పుడు వైద్య విజ్ఞానం బాగా అభివృద్ధి చెందింది. ఎటువంటి లోపాన్నయినా సరిదిద్దుతున్నారు. నాకు తెలిసిన ఎంతోమందికి అలా పిల్లలు పుట్టారు. నువ్వు కూడా మంచి డాక్టర్‌ను కన్సల్ట్ చెయ్యి పుడతారు.''

"మీరింకా చాదస్తపు భావాలు సార్. మగవాళ్ళకు పరీక్షలేమిటి? మీరు చెప్పినటువంటివాళ్ళు నూటికో కోటికో ఒకరుండవచ్చు. కానీ నేనలాంటి వాళ్ళకు చెందను. నాకు పరీక్షలనవసరం అనుకుంటాను.''

ఆ మాటలకు నాకు చాలా కోపమొచ్చింది. అయినా తమాయించుకున్నాను.

రాజేష్‌లాంటి వాళ్లుండబట్టేకదా చాలామంది స్త్రీలు అన్యాయానికి గురవుతున్నారు. పెళ్లికి ముందు అమ్మాయిలో గుణగణాలను వెతుకుతారుగానీ అబ్బాయిలో పిల్లలు పుట్టించే సామర్థ్యం వుందో లేదో ఎవరూ పట్టించుకోరు. అలాంటి మగాడ్ని పెళ్లాడిన ఆడది పిల్లలు పుట్టకపోతే జీవితాంతం అందరిచేతా మాటలు పడుతూ జీవించవలసి వస్తుంది. పాశ్చాత్య దేశాల్లో మాదిరిగా పెళ్లికి ముందే ఆడా మగా అన్ని పరీక్షలు చేయించుకునే విధానం మన దేశంలో కూడా ఉంటే బాగుండుననిపించింది.

"అవునూ! ఇప్పుడెక్కడికి బయలుదేరావు?'' అనడిగాను.

"పెళ్లిచూపులకని కనిగిరి వెళుతున్నాను సార్'' అన్నాడు కొంచెం సిగ్గుపడుతూ.

"ఎవరికీ మీ తమ్ముడికా?''

"కాదు సార్! నాకే'' అన్నాడు రాజేష్.

ఆ మాటలకు బిత్తరపోయాను.

"ఏమిటీ నీకా?''

"అవును సార్. మరో పెళ్లి చేసుకుందామనుకుంటున్నాను సార్. ఇద్దరికీ ఇంక పిల్లలు పుట్టరనిపించింది. అందుకే మరో ప్రయత్నం చేద్దామనుకుంటున్నాను'' అన్నాడు తాపీగా.

ఆ మాటలకు నాకు కోపం నషాళానికంటింది.

ఏమిటీ మనుషులు? ఎక్కడికి పోతుందీ వ్యవస్థ? సమాజంలోని ఇతర రంగాలలో ఎన్నో మార్పులొస్తున్నాయి. కానీ మనిషిలోనే మార్పు రావడంలేదు. ఎంత మూర్ఖత్వం! మరో ఆడదాని జీవితాన్ని నాశనం చేయడానికి రాజేష్ కంకణం కట్టుకున్నాడు.

"అవునూ! ఇప్పుడు చేసుకునే పెళ్లివలన పిల్లలు పుడతారనే గ్యారంటీ వుందంటావా?'' అనడిగాను కోపాన్ని దిగమింగుకుంటూ.

"భలేవారే సార్! ఏవో ఒకటి రెండు ఫెయిలయ్యాయని ఇది కూడా ఎందుకు ఫెయిలవుతుంది సార్. అయినా మన ప్రయత్నంలో లోపం ఉండకూడదు కదా'' అన్నాడు నవ్వుతూ.

అతని నవ్వు చూస్తే నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోయాను. అప్పుడే నా నోటిలో నుంచి నేను ఎప్పుడూ ఎవరినీ అనని మాటలు వచ్చేసాయి.

"అయితే ఓ పని చెయ్యి రాజేష్. పెళ్లి చేసుకున్న వెంటనే ఫామిలీని బ్రహ్మచారులుండే పోర్షన్ ప్రక్కనో లేక ఏ స్టూడెంట్స్ హాస్టల్ ప్రక్కనో ఇల్లు తీసుకుని పెట్టు. నీవల్ల కానిది వాళ్ళవల్లనయినా నీకు పిల్లల్ని ఎత్తుకునే అదృష్టం పడుతుంది. ఎందుకంటే నీకింక పిల్లలు పుట్టరని నీ ఇద్దరి భార్యలూ రుజువు చేసారు. వాళ్లల్లో ఒకరికి లోపమున్నా మరొకరికైనా పుట్టి ఉండేవారు. కానీ ఇద్దరికీ పుట్టలేదంటే లోపం నీలోనే వుందని ఇట్టే అర్థమైపోతుంది. ఖచ్చితంగా ఈ పెళ్లివల్ల కూడా నీకు పిల్లలు పుట్టరు. నేను చెప్పినట్లు చేస్తే నీకు పుట్టకపోయినా కనీసం నీ పిల్లలని చెప్పుకునే అవకాశం ఏర్పడుతుంది. లేకపోతే ఈమెకు పుట్టలేదని నువ్వు మరో పెళ్లికి తయారవుతావు. అప్పుడూ నీకు పిల్లనివ్వడానికి ఆడపిల్లల తండ్రులు ముందుకు వస్తారు. అటువంటి దౌర్భాగ్యం మనది మరి. ఏమంటావ్?'' అతనిమీద కలిగిన కోపాన్నంతా అలా మాట్లాడి తీర్చుకున్నాను. ఆ మాటలకతను బాధపడతాడనిగానీ, దానికి రియాక్టయి నామీద తిరగబడతాడనికానీ ఊహించలేదు. అలా అనే హక్కు నాకుందా అని కూడా ఆలోచించలేదు. అక్కడో అమ్మాయిని పరోక్షంగా అవమానిస్తున్నానని భావించలేదు. కానీ రాజేష్ నన్నేమీ అనలేదు. అక్కడ నుంచి మాత్రం వెళ్లిపోయాడు.

ఆ తర్వాత అన్పించింది అలా మాట్లాడకుండా అతనికి మరొకరకంగా చెప్పి ఉండవలసిందని. కాలు జారితే సర్దుకోగలంగానీ నోరు జారితే ఏం చెయ్యలేం కదా!


***

ఒక సంవత్సరం తరువాత రాజేష్ నాకు బజారులో కన్పించాడు. ప్రక్కనే భార్య అనుకుంటాను ఆమె చేతిలో రెండు మూడు సంవత్సరాల వయసున్న బాబు ఉన్నాడు. నన్ను చూసిన వెంటనే నా దగ్గరకు నవ్వుతూ వచ్చి పలకరించాడు.

"ఎలా వున్నారు మాస్టారూ! చాలాకాలమయింది మిమ్మల్ని చూసి'' ఎంతో గౌరవంగా వున్నాయి అతని మాటలు.

అతన్ని చూస్తే నాకే గిల్టీగా అన్పించింది.

"బాగానే వున్నానయ్యా'' అని మాత్రం అన్నాను.



"ఆ రోజు మీరా మాటలన్నప్పుడు నాకు చాలా బాధ కలిగింది సార్. కానీ ఆలోచించిన మీదట మీ మాటల్లో వాస్తవం కన్పించింది. వెంటనే పెళ్లి చూపులకు వెళ్లడం మాని డాక్టర్ని కన్సల్ట్ చేసి స్పెరమ్ టెస్ట్ చేయించాను. నాలో కౌంటు చాలా తక్కువగా వుందని, పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలిసింది. ఆ విషయాన్ని నా భార్యలిద్దరికీ చెప్పాను. మొదటి భార్య ఏమీ అనలేదు. కానీ రెండవ భార్య మాత్రం పిల్లల్లేకుండా నాతో ఉండలేనంది. విడాకులు కావాలంది. ఈ కారణం చూపిస్తే వెంటనే విడాకులు మంజూరయ్యాయి. ఆమె వేరే పెళ్లి చేసుకుంది.

ఇప్పుడామె గర్భవతి అని తెలిసింది. ఇంక ఎలాగూ పిల్లలు పుట్టరు కాబట్టి నా మొదటి భార్య, నేను సంప్రదించుకుని అనాథాశ్రమం నుంచి ఒక బాబుని తెచ్చుకుని పెంచుకుంటున్నాము. అన్నట్టు ప్రమోషను కూడా వచ్చింది. ఇప్పుడు చాలా ఆనందంగా గడుపుతున్నాం సార్. ఆ రోజు మీరు నా కళ్ళు తెరిపించారు. మీకు చాలా కృతజ్ఞతలు సార్'' అన్నాడు రాజేష్.

అప్పుడు నేనన్న మాటలకు అతనలా రియాక్టవుతాడని మాత్రం నేను ఊహించలేదు. కానీ ఓ మనిషిని మార్చగలిగాననే తృప్తి నాలో మిగిలిపోయింది.

★